సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వీఎంసీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వీఎంసీ విద్యార్థులు

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ వీఎంసీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువత నుంచి మంచి స్పందన లభించింది. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం విశిష్టమైనదన్నారు. ఒకరి రక్తదానంతో అనేక మందికి ప్రాణదానం చేసే అవకాశం ఉందన్నారు. రక్తదానం విషయంలో యువత అపోహలు వీడి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులతో పాటు కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: గంభీరం, హనుమంతువాక కూడళ్లలో ఆటో డ్రైవర్లకు బుధవారం రహదారి నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక బృందాలు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 8 ఆటోలపై కేసులు నమోదు చేశారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు హరి ప్రసాద్‌రావు, ఎస్. శ్రీనివాస యాదవ్, ఎస్‌ఐ రాజు తదితరులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

బీచ్‌రోడ్డు : ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు పేకాట రాయుళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌ఏడీ వద్ద గల శాంతినగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందిన మేరకు సీపీ ఆదేశాలతో పేకాట స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.3,63,270 నగదు, 6 సెల్‌ఫోన్లు సాధీనం చేసుకోవటంతో పాటు ఆరుగురుని అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

జీడిపప్పు దినోత్సవం నేడు

బీచ్‌రోడ్డు: జాతీయ జీడిపప్పు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీఈడీపీ, ఆంధ్రప్రదేశ్ జీడిపప్పు మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రామ్‌నగర్‌లోని గ్రీన్‌పార్కు హోటల్‌లో వేడుకలను నిర్వహించనున్నట్లు ఏపీఈడీఏ ఏజీఎం ఆర్‌పీ నాయుడు ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్, ఉత్తరాంధ్ర జిల్లా అధికారులు, ఉత్పత్తిదారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం సాకారం

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

నాడు

ప్రతీ పనికి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి, జీవీఎంసీ పరిధిలో జోనల్ కార్యాలయానికి, ప్రధాన కార్యాలయానికి, ఇతర కార్యాలయాలకు ప్రజలు తిరగాల్సి వచ్చేది. సమయం, డబ్బు వృథా అయ్యేవి.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేరువలో సేవలు ఉండాలనే లక్ష్యంతో సచివాలయాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో వార్డులోనే పనులు పూర్తవుతున్నాయి. ప్రజలకు వ్యయ, ప్రయాసలు తప్పాయి. ఇంటి ముంగిటకే ప్రభుత్వసేవలు అందుతున్నాయి.



13వ వార్డు 7వ సచివాలయంలో లబ్ధిదారుకు జగనన్న ఇళ్ల పట్టాలు అందిస్తున్న కార్పొరేటర్ (ఫైల్)



9వ వార్డు సంజయ్‌గాంధీకాలనీలో కొత్తగా నిర్మించిన 34వ నంబరు సచివాలయ భవనం



సంజయ్‌గాంధీ కాలనీలో 27వ నంబరు సచివాలయం

ఆరిలోవ: గ్రామ స్వరాజ్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో ప్రధానమైన సచివాలయ వ్యవస్థ ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ప్రతీ వార్డులో ప్రజలకు ఇంటి సమీపంలోనే సులువుగా పరిష్కారం లభించేందుకు ఉద్దేశించిన ఈ వ్యవస్థ వారి మన్ననలు అందుకుంటోంది. ఈ వ్యవస్థతో పాలన అత్యంత సులువైంది.

99 సచివాలయాలు

తూర్పు నియోజకవర్గంలో సుమారు 5 లక్షల జనాభా ఉన్నారు. వారికోసం 2019లో ఇక్కడ 99 సచివాలయాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గం జీవీఎంసీ జోన్-2, 3 పరిధిలో ఉంది. జోన్-2 పరిధిలో 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు 37 సచివాలయాలు ఉండగా జోన్-3 పరిధిలో 15వ వార్డు నుంచి 23వ వార్డు వరకు, 28వ వార్డులో 62 సచివాలయాలున్నాయి. వాటిలో ఒకచోట కొత్త భవనం నిర్మించగా మిగిలిన చోట్ల కొన్ని ప్రభుత్వ భవనాల్లో, ఇంకొన్ని అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో 34వ నంబరు సచివాలయాన్ని ఇటీవల సుమారు 20 లక్షలతో నిర్మించారు.

ఇవీ సేవలు

సచివాలయాల్లో ప్రజలకు 33 రకాల సేవలు అందిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, ఇంటి పన్నులు, నీటి పన్నులు, తదితర వాటికి సంబంధించిన సుమారు 16 విభాగాలకు చెందిన సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విదేశీ దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంటల బీమా, వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ నేతన్న హస్తం, జగనన్న చేదోడు తదితర సంక్షేమ పథకాలతో పాటు రెవెన్యూ అధికారుల ద్వారా ధ్రువపత్రాలు, జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉన్నాయి.

నియోజకవర్గంలో జనాభా	సుమారు 5 లక్షలు
వార్డులు	15
వార్డు సచివాలయాలు	99
సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్య	650

వేలల్లో లబ్ధిదారులు

ప్రతీ సచివాలయంలో వేల సంఖ్యలో లబ్ధిదారులు ఉన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ సచివాలయంలో 2,500 నుంచి 6,000 మధ్య లబ్ధిదారులు ఉన్నారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి 34వ నంబరు సచివాలయంలో 5,512 మంది, పదో వార్డులోని 23వ నంబరు సచివాలయంలో 2,932 మంది లబ్ధిదారులు ఉన్నారు.

ప్రతీ 50 ఇళ్లకు ఓ వలంటీర్

గతంలో ప్రభుత్వం ఏ పథకం అమలు చేస్తుందో, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎవరిని సంప్రదించాలో ప్రజలకు తెలియని పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్లే ఇళ్లకు వెళ్లి పథకాలను వివరించి, వారే దరఖాస్తు చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు ఇతర పింఛన్లను ప్రతినెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యవస్థతో ప్రజల ఆత్మగౌరవం పెరిగింది. పింఛన్ల కోసం ఎండలో పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా పోయింది. ఎవరైనా లబ్ధిదారులు అనారోగ్యంతో దూరంగా ఉన్నా, ఆస్పత్రుల్లో చేరినా వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు.

మా ఇంటి దగ్గర్లోనే సచివాలయం



మా ఇంటికి దగ్గరలోనే సచివాలయం ఉంది. ఇంటి నుంచి నడిచి వెళ్లేంత దూరం. ఏ అవసరమైనా వెంటనే సచివాలయానికి వెళ్లి అక్కడి సిబ్బందిని సంప్రదిస్తున్నాం. గతంలో ఏదైనా పని కోసం చాలా దూరంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఆ భారం తప్పింది నాకు వృద్ధాప్య పింఛను వస్తుంది. జగనన్న ఇల్లు వచ్చింది. ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందాను.

– ముప్పళ్ల తిరుపతిరావు, సంతపాలెం

ఏ సమస్య వచ్చినా సచివాలయానికే..



మా వీధిలో ఏ సమస్య వచ్చినా సచివాలయంలో ఫిర్యాదు చేస్తున్నాం. వీధి దీపాలు వెలగకపోయినా, రోడ్ల సమస్య, శానిటేషన్ సమస్యలు సిబ్బందికి చెప్పుకొంటున్నాం. సంక్షేమ పథకాలకోసం దరఖాస్తు చేస్తున్నాం. సచివాలయం ఇంటి దగ్గరలో అందుబాటులో ఉండటంతో ఏ పని అయినా సులువుగా అవుతుంది.

– మౌనిక, ఎస్‌కేఎంఎల్ నగర్

25న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్



మింది జెడ్పీ హైస్కూల్ మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 25వ తేదీన శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మింది వినాయక వేంకటేశ్వర సాయినాథ ఆలయ కమిటీ చైర్మన్ గుడివాడ నాగమణి తెలిపారు. ఈ మేరకు కల్యాణోత్సవం నిర్వహించనున్న పాఠశాల మైదానాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం 4.45 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 8.01 గంటల నుంచి ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

రసాయన పరిశ్రమల్లో భద్రతపై సెమినార్



మాట్లాడుతున్న గెస్ట్ ఫ్యాకల్టీ

మురళీనగర్: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం రసాయన పరిశ్రమల్లో భద్రతపై లాస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జనరల్ మేనేజర్(ప్రాజెక్ట్ సేఫ్టీ) డా ఎ.ఎ.గిరినాథన్ గెస్ట్ ఫ్యాకల్టీగా మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమల్లో తీసుకోవలసిన భద్రతల గురించి వివరించారు. పరిశ్రమల్లో అనుసరించాల్సిన కేస్ స్టడీస్, ప్రమాదాలను నివారించే పలు పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఎ.వరహాలు, కెమికల్ ఇంజినీరింగ్ లాస్ట్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఎంఈఎస్ ఆల్ పెన్షనర్స్’ నూతన కమిటీ ఎన్నిక



విజయ ప్రసాద్ డాక్టర్ జాకబ్ లక్ష్మణరావు

విశాఖ విద్య: మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ఆల్ కేడర్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్‌ఏడీ కూడలిలోని మర్రిపాలెం వాకింగ్ పార్కులో బుధవారం అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కందుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా చెటికం విజయప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కండిపిల్లి నూకరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. కనకారావు, సి.టి.రెడ్డి, శివరావు, రఘునాథ్, ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వారా జాకబ్, కోశాధికారిగా ధవళ లక్ష్మణరావును ఎన్నుకున్నారు. ఆడిటర్ కమ్ అడ్వైజర్‌గా కాకి సత్యారావు, లీగల్ అడ్వైజర్‌గా పి. లక్ష్మణమూర్తిని ఎంపిక చేసుకున్నారు. జాయింట్ సెక్రటరీగా ఎ. మోహన్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పులి సత్యనారాయణతో పాటు పలువురు కార్యవర్గంలో చోటు కల్పించారు. పెన్షనర్ల సమస్యలపై నూతన కమిటీ కృషి కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని నిర్ణయించారు.

అప్పన్న దేవస్థానంలో లీజు హక్కులకు వేలం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం లీజు హక్కులు ఖరారు చేయడానికి బుధవారం బహిరంగ వేలం, షీల్డ్ టెండర్లు ప్రక్రియ నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితికి కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని 1 నుంచి 20 షాపులు లీజు ఇచ్చేందుకు ఈ వేలం నిర్వహించారు. అలాగే సింహగిరి టోల్‌గేట్ వద్ద ఏడాది పాటు టికెట్లు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన షీల్డ్ టెండర్ కోటి 20లక్షల 50వేలకు వేశారు. అలాగే సింహగిరిపై భక్తుల పాదరక్షలు భద్ర పరిచేందుకు వేసిన బహిరంగ వేలం పాట 36లక్షల 30వేలు హెచ్చుపాటకి వెళ్లింది. అలాగే సింహగిరిపై టీ కాఫీ మిషన్ ద్వారా విక్రయించుకోవడానికి నిర్వహించిన షీల్డ్ టెండర్ 30వేలకు వెళ్లింది. వీటిని ఈవో పరిశీలించి కమిషనర్ ఆమోదానికి పంపించాల్సి ఉంది. దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్‌లు వై.అప్పారావు, రాజ్యలక్ష్మి, గాయత్రి, ఉద్యోగులు దొంతల రమణ, చక్రవర్తి , దేవదాయశాఖ ఉద్యోగి నీలిమ వేలం పాటలు నిర్వహించారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే సత్ఫలితాలు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు

పద్మనాభం: విద్యార్థినులు ఓ లక్ష్యం నిర్దేశించుకుని చదివినప్పుడు ఆశయాన్ని సాధించగలరని విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు అన్నారు. మండలంలోని కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని ఒడుదుడుకులెదురైనా శ్రమించి విజయం సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, విలువల కలిగిన వ్యక్తులతో స్నేహం చేయాలన్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీదేవి, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, డీపీఆర్‌వో మణిరాం, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి’

ఎంవీపీకాలనీ: నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు నగర పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ప్రకటనలో సూచించారు. బుధవారం ద్వారకా నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం షాక్‌కు గురిచేసిందని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లారీలు సిటీలోకి కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులకు జిల్లా అధికారులు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి చెల్లుబోయిన



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మంత్రి చెల్లుబోయిన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర సమాచార ,బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: గంభీరం, హనుమంతువాక కూడళ్లలో ఆటో డ్రైవర్లకు బుధవారం రహదారి నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక బృందాలు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 8 ఆటోలపై కేసులు నమోదు చేశా రు. మోటార్ వాహన తనిఖీ అధికారులు హరి ప్రసాద్‌రావు, ఎస్. శ్రీనివాసయాదవ్, ఎస్‌ఐ రాజు తదితరులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలి



దీక్షలో పాల్గొన్నఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1014వ రోజు, బుధవారం సంస్థకు చెందిన ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యూటీడీ, ఆర్ అండ్ డీ, డీఎన్‌డబ్ల్యూ, ఈటీఎల్, టెలికామ్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్మికులను చిన్నచూపు చూసిన ఎన్నో రాజకీయ పార్టీలు ఇప్పటికీ దీనస్థితిలో ఉన్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

త్వరలో 108 సిబ్బందికి యూనిఫారం



అరబిందో ఆపరేషనల్ హెడ్ గంగాధర్‌ను సన్మానిస్తున్న 108 అధికారులు, సిబ్బంది

మహారాణిపేట : అరబిందో ఆధ్వర్యంలో నడుస్తున్న 108, 104 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సిబ్బందికి త్వరలో యూనిఫారం వస్తుందని ఆపరేషనల్ హెడ్ గంగాధర్ స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాల వాహనాల సిబ్బందితో బుధవారం సమీక్షించారు. క్షతగాత్రులను సకాలంలో రక్షించి ప్రాణాపాయం లేకుండా చూడాలని, త్వరలో మరిన్ని కొత్త వాహనాలు వస్తున్నాయని తెలిపారు. రోగుల వద్ద డబ్బులు తీసుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ త్రినాథరావు, సిటీ కోఆర్డినేటర్ ఎం.సురేష్, ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, 104 డీఎం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వినతులు పరిష్కరించాలి

‘జగనన్నకు చెబుదాం’లో కలెక్టర్ మల్లికార్జున



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పద్మనాభం: ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. పద్మనాభంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున అధికారులు చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అధికారుల తీరుతో అర్జీదారులు సంతృప్తి చెందాలని హితవు పలికారు. దూర ప్రాంతాల నుంచి రాలేని అర్జీదారులు మండల స్థాయిలోనే తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇదో చక్కని వేదికన్నారు. అనంతరం అర్జీదారుల సమస్యలు విని 74 మంది నుంచి వినతులు స్వీకరించారు. కాలనీల్లో అపరిష్కృతంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, కాలనీ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని, భూ వివాదాలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు, పద్మనాభం తహసీలార్దర్ కె.వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బాలవికాస్ దినోత్సవం



బాలవికాస్ విద్యార్థులతో స్టీల్‌ప్లాంట్ సీవీవో కరుణరాజు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి మందిరంలో బుధవారం బాలవికాస్ దినోత్సవం ఘనంగా జరిగింది. సత్యసాయి 98వ జయంతి సందర్భంగా బాలవికాస్ విద్యార్థులు వేదపఠనం చేశారు. నృత్యాలు ప్రదర్శించారు. అంతకు ముందు వేకువజామున మందిరంలో సుప్రభాతం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్.కరుణరాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఎంతో విశిష్టమైందన్నారు. ప్రపంచాన్ని నడిపించే రైలుకు భారతదేశం ఇంజిన్ వంటిదని, మిగతా దేశాల బోగీలు లాంటివన్నారు. బాలవికాస్ విద్యార్థుల వేదపఠనం, భజనలు ఎంతో ఆనందం కలిగించాయన్నారు. కార్యక్రమంలో వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్, బాలవికాస్ ఇన్‌చార్జి జయశ్రీ గణేశన్, సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.